
సాక్షి ప్రకాశం

గురువారం। 7। నవంబర్। 2024



తెల్లబండను తొలిచేస్తున్న పచ్చ తొండలు
వైట్ క్వార్ట్జ్ అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. తెల్లరాయిని అక్రమంగా రవాణా చేస్తూ టీడీపీ నేతలు కోట్లు గడిస్తున్నారు. - 10లో..



యువకుడి అనుమానాస్పద మృతి
బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న యువకుడు బేస్తవారిపేట మండలం చింతలపాలెం సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. - 10లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

పరిమితం..సురక్షితం

నాలుగేళ్లుగా వస్తున్న లాభాలతో పొగాకు రైతులు ఉత్సాహంగా ఉన్నారు. రికార్డు ధరలు నమోదవుతుండటంతో వారి పంట పండింది. ప్రస్తుత సీజన్ ఆశాజనకంగా ముగియడంతో కొత్త సీజన్‌కు సిద్ధమయ్యారు. మార్కెట్ సైతం ఆశాజనకంగా ఉండడంతో భారీగా సాగు చేసేందుకు రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ ఏడాది పొగాకు సాగు పరిమితిని భారీగా పెంచుతూ టుబాకో బోర్డు నిర్ణయం తీసుకోవడం రైతులకు కలిసొచ్చే అంశం. బ్యారన్ పరిమితిని కూడా దాదాపు 6 క్వింటాళ్ల వరకు పెంచింది. దీంతో బ్యారన్ ధరలు రెట్టింపయ్యాయి. మార్కెట్ ఎలా ఉంటుందో తెలియదు కనుక పరిమితసాగే మంచిదని బోర్డు అధికారులు రైతులకు సూచిస్తున్నారు.



కనిగిరి ప్రాంతంలో పొగాకు సాగు

- లాభాలు వస్తుండడంతో ఉత్సాహంగా సాగుకు రైతులు సిద్ధం
- రెట్టింపైన బ్యారన్ ధరలు
- గత ధరలు పలికే పరిస్థితి లేదంటూ ముందస్తు హెచ్చరికలు
- సాగు విస్తీర్ణం తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటూ ప్రచారం
- రైతులకు పూర్తి స్థాయిలో అందని సబ్సిడీ ఎరువులు

కనిగిరి రూరల్: జిల్లాలో సాగు నీటి వసతులు తక్కువగా ఉండటంతో మెట్టపైర్లు ఎక్కువగా సాగుచేస్తుంటారు. కంది తర్వాత అత్యధికంగా సాగుచేసే వాణిజ్య పంట పొగాకు. గత ఏడాది పొగాకుకు మంచి గిట్టుబాటు ధరలు దక్కడంతో రైతులు ఎక్కువగా పొగాకు సాగుపైనే దృష్టి సారించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని గ్రామాల్లో ముందస్తు ఖరీఫ్‌లో వేసిన కొంత పొగాకు దెబ్బతింది. అయినా రైతులు పొగాకు సాగుకు మక్కువ చూపుతుండటంతో దిగుబడి పెరిగితే.. ధరల డిమాండ్ తగ్గుతుందని అందు వల్ల పొగాకు సాగు తగ్గించాలని బోర్డు అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రకాశం రీజియన్ పరిధిలో రానున్న సీజన్‌కు 105.27 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి ఇస్తూ పొగాకుబోర్డు నిర్ణయం తీసుకుంది. ప్రకాశం రీజియన్ పరిధిలో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. ప్రకాశం జిల్లాలో ఒంగోలు-1, ఒంగోలు- 2, కొండపి, కనిగిరి, టంగుటూరు, వెల్లంపల్లి, పొదిలి వేలం కేంద్రాలు ఉండగా, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కందుకూరు-1, కందుకూరు- 2, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2023-24లో పరిమితి 89.9 మిలియన్ కేజీలు. వచ్చే సీజన్ అంటే 2024-25లో దీనికి అదనంగా 15.37 మిలియన్ కేజీలు ఉత్పత్తి చేసేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. అలాగే బ్యారన్ పరిమితిని కూడా భారీగానే పెంచింది. గతంలో ఎస్ఎల్ఎస్ పరిధిలో బ్యారన్‌కు 36.50 క్వింటాళ్లు ఉంటే అది ఇప్పుడు 42.75 క్వింటాళ్లకు, ఎస్‌బీఎస్ పరిధిలో 35.50 క్వింటాళ్ల నుంచి 41.75 క్వింటాళ్ల ఉత్పత్తిని విక్రయించేలా బోర్డు నిర్ణయం తీసుకుంది. అంటే బ్యారన్‌కు దాదాపు 6 క్వింటాళ్ల వరకు పెంచింది.

రెట్టింపైన బ్యారన్ ధరలు

వరుసగా లాభాలు వస్తుండడంతో కొత్తసీజన్‌కు రైతులు సిద్ధమవుతున్నారు. 2024-25 సీజన్‌కు భారీగా సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రైతుల మధ్య పోటీతో అటు బ్యారన్, పొలం కౌలు ధరలు రెండింతలయ్యాయి. బ్యారన్ కౌలు రూ.3 లక్షల వరకు చెల్లించేందుకు కూడా రైతులు వెనుకాడడంలేదు. అలాగే పొలాల విషయంలో కూడా ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు కౌలు ఇస్తున్నారు. మరోవైపు మార్కెట్ ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితుల్లో అధికంగా కౌలు పెంచుకోవద్దని బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో అందని ఎరువులు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు రైతులకు కావాల్సినంతగా అన్ని రకాల ఎరువులు, పట్టాలు సబ్సిడీపై పంపిణీ చేసి ఆదుకున్నారు. ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే కనిగిరి ప్రాంతంలో 2 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. కానీ పొగాకు రైతులకు కావాల్సిన ఎరువులు, పట్టల సామగ్రి సంవృద్ధిగా దిగుమతి కాలేదు. కనిగిరిలో 210 మంది రైతులు ఎరువులు, సల్ఫేట్, పట్టల కోసం దరఖాస్తులు చేసుకోగా, 150 మంది బోర్డు అధికారులకు అప్లికేషన్లు అందజేసినట్లు తెలిసింది. అయితే ఇంకా కొన్ని రకాల ఎరువులు బోర్డుకు చేరలేదని సమాచారం. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో 915 హెక్టార్లలో పొగాకు పంటకు నష్టం వాటిల్లింది. నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగు పెంచవద్దు

గతేడాది కర్నాటక రాష్ట్రంలో సాగు తగ్గడంతో ఏపీలో పొగాకు శాతం పెరిగినా.. మంచి డిమాండ్ పెరిగిందని.. ఈ ఏడాది కర్నాటకలోనే 100 మిలియన్లకు గాను ఇప్పటికే 96 మిలియన్లు వేశారు. మిగతాది కూడా పూర్తి జరిగే అవకాశం ఉన్నట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు వెల్లడించారు. దీనివల్ల పొగాకు సాగు ఉత్పత్తి పెరిగితే.. డిమాండ్ తగ్గి తగిన ధర ఉండదని వెల్లడించారు. పొగాకు రైతులకు 25 శాతం సబ్సిడీపై పొటాష్, డీఏపీ, ఎస్‌టీపీ ఎరువులను అందజేస్తున్నట్లు వెల్లడించారు.

– కోటేశ్వరరావు,
టుబాకో ఆక్షన్ సూపరింటెండెంట్, కనిగిరి

కార్మికుల కడుపులు కొట్టొద్దు

- మున్సిపల్ పారిశుద్ధ్య మేస్త్రీల అర్ధనగ్న నిరసన ప్రదర్శన

ఒంగోలు టౌన్:

ఎమ్మెల్యే సార్...కార్మికుల కడుపులు కొట్టొద్దు.. వీళ్లంతా 20 ఏళ్లుగా మేస్త్రీలుగా పనిచేస్తున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించండి. వారిని విధుల్లోకి తీసుకునేందుకు అధికారులను ఆదేశించండని సీపీఎం నగర కార్యదర్శి టి.మహేష్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం "మంచి ప్రభుత్వం" అని గొప్పలు చెప్పుకుంటోందని, మరోవైపు చిరుద్యోగులు, కార్మికుల కడుపులు కొడుతోందని మండిపడ్డారు. ఇదేనా మంచి ప్రభుత్వం చేయాల్సిన పనులంటూ నిలదీశారు. తక్షణమే మేస్త్రీలను విధుల్లోకి తీసుకోకుంటే మిగతా విభాగాలకు చెందిన కార్మికులతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మేస్త్రీల వ్యవస్థ లేదని, అందరూ కార్మికులుగా పనిచేయాలని చెప్పడాన్ని యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు తప్పుపట్టారు. 20 ఏళ్లుగా మేస్త్రీలుగా పనులు చేస్తున్నారని, గత ప్రభుత్వంలోనూ వారంతా మేస్త్రీలుగా పనిచేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అర్ధాంతరంగా వారిని పనుల నుంచి నిలిపేయడమంటే వారి కుటుంబాలను రోడ్డు మీద పడేయడమేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న మేస్త్రీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలోయూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, అజయ్, ప్రశాంత్, విజయ్, జయవర్ధన్ పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

న్యూస్‌రీల్

ప్రాధాన్యత క్రమంలో పనులు చేసేలా ప్రణాళికలు

- జెడ్పీ సీఈఓ చిరంజీవి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

ఒంగోలు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసేందుకు రూపొందించే ప్రణాళికలు ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టేలా ఉండాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో గ్రామ సభలు నిర్వహించి గ్రామ, మండల, జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ఈ నెల 7, 8వ తేదీల్లో రెండు రోజులు 28 మండలాల్లోని మండల అభివృద్ధి అధికారులు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ బాలమ్మ, డీపీవో వెంకటనాయుడు, కనిగిరి డీఎల్డీఓ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రామనాథం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో బాలరాజు ప్రతిభ



అథ్లెటిక్స్‌లో పాల్గొని విజేతగా నిలిచిన బాలరాజు

త్రిపురాంతకం: రాష్ట్ర స్థాయి ఏపీఎస్ అథ్లెటిక్స్ పోటీల్లో ఫిజికల్ డైరెక్టర్ బాలరాజు సత్తాచాటారు. నాగార్జున యూనివర్శిటీలో ఈపోటీలు జరుగుతున్నాయి. మండలంలోని గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ డీ బాలరాజు ఓపెన్ కేటగిరీలో ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలరాజును ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మేఘనకు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన మేఘనకు అభినందనలు తెలుపుతున్న ఎంఈఓ కిషోర్

ఒంగోలు సిటీ: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో హేమర్‌త్రో విభాగంలో ఒంగోలుకు చెందిన శీలం మేఘన గోల్డ్‌మెడల్ సాధించడంపై ఎంఈఓ టి.కిషోర్ బుధవారం అభినందనలు తెలిపారు. సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మేఘన జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. మేఘనను కరస్పాండెంట్ సిస్టర్ లిల్లీ, ప్రధానోపాధ్యాయులు సిస్టర్ జయషీల, కె.నక్షత్రం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సామగ్రి తరలింపుపై ఆదేశాలివ్వలేదు

- ఏపీఎంఎస్ఐడీసీ రిమ్స్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ విజయభాస్కర్

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని తరలించుకోమని నిర్మాణ సంస్థకు ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని ఏపీఎంఎస్ఐడీసీ రిమ్స్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మెడికల్ కళాశాల కథ కంచికే' అన్న శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మెడికల్ కాలేజీకి సంబంధించి సుమారు రూ.25 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మూడు నెలలుగా నిర్మాణ పనులు నిదానంగా సాగుతున్న మాట వాస్తవమేనన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీని అక్కడ నుంచి తరలించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, నిర్మాణం ఆపమని ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదన్నారు.

వైఎస్సార్ సీపీ మాట.. పవన్‌కళ్యాణ్ నోట

- వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్



కుప్పం ప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అంగీకరించడాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ స్వాగతించారు. బుధవారం కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచే శాంతి భద్రతలు అదుపు తప్పాయని, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతున్న మాటలు నిజమేనని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో స్పష్టమైందన్నారు. తానే హోంమంత్రి అయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని, హోంమంత్రి అనిత, డీజీపీలు బాధ్యతగా వ్యవహరించాలని సోమవారం పవన్ కళ్యాణ్ చురకలు అంటించారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులపై మా పార్టీ నేతలు మాట్లాడితే రాజకీయ స్వార్థంతో మాట్లాడుతున్నామని విమర్శించిన టీడీపీ పెద్దలు ఇప్పుడేమని జవాబు చెబుతారన్నారు. పవన్‌కళ్యాణ్ చేసిన కామెంట్స్ .. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, ప్రజాప్రయోజనాల కోసమే చేసినట్టు ఉండాలని, నిజంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేసేలా వ్యవహరించాలని మేము ఆకాంక్షిస్తున్నామన్నారు. ఆర్యవైశ్యులైన పొట్టి శ్రీరాములుకి నివాళులర్పించి, ఆ మహనీయుని త్యాగాన్ని కీర్తించాల్సి వస్తుందనే కారణంతో ఏకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరపకపోవడంపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును పవన్‌కళ్యాణ్ ప్రశ్నించాలని ఆర్యవైశ్యుల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. టీటీడీ పాలకమండలి, ఇతర కమిటీల్లో ఆర్యవైశ్యులకు చోటు కల్పించకుండా అన్యాయం చేసిన చంద్రబాబునాయుడు ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలన్నారు. ఆర్యవైశ్యుల పట్ల విషాన్ని చిమ్మవద్దని చంద్రబాబుకు సూచించాలని పవన్‌కళ్యాణ్‌ను కోరుతున్నామన్నారు.

చిత్రమైన చిత్తరువులు

- బూజుతో బొమ్మలు తయారు చేస్తున్న వంశీకుమార్
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



బూజుతో అబ్దుల్ కలామ్ చిత్రం



పక్షి ఈకపై వేసిన చిత్రం



ఆకుమీద జగన్ చిత్రం



ఆకుల్లో తల్లి బిడ్డల ఆకృతులు

గిద్దలూరు రూరల్: సాధారణంగా చిత్రకారులు కాగితాలు, బోర్డుల మీద బొమ్మలు గీస్తుంటారు. కానీ ఆ యువకుడు బూజుతో బొమ్మలు వేస్తూ అందరినీ అబ్బుర పరుస్తున్నాడు. నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో మండలంలోని దిగువమెట్ట గ్రామానికి చెందిన ఆర్లగడ్డ వంశీకుమార్‌కు చిన్నతనం నుంచి చిత్రకళ మీద మక్కువ. డిగ్రీ వరకు చదువుకున్న వంశీకుమార్ ఖాళీ సమయాల్లో తనలోని కళకు పదునుపెట్టుకుంటూ ముందుకు సాగాడు. మొదట పేపర్ మీద పెన్సిల్‌తో బొమ్మలు గీయడం సాధన చేసిన వంశీ క్రమంగా ఆకుల మీద, పాటలతో ముఖాకృతి వచ్చేలా చిత్రాలు రూపొందించాడు. చిత్రకళపై అతడి ఆసక్తిని గమనించిన స్నేహితులు, బంధువుల ప్రోత్సాహంతో మరింత సాధన చేశాడు. అందరిలా కాకుండా విభిన్నంగా చిత్రాలు వేయాలని తలచి గోడ మీద పాకుతున్న సాలెపురుగును గమనిస్తూ అవి పెట్టే గూళ్లను చూసి వాటి మాదిరిగా బూజుతో కొత్తరకంగా చిత్రాలు రూపొందించాలనుకున్నాడు. దీంతో కొంత మేర బూజును సేకరించి చిత్రాలను వేయడం మొదలుపెట్టాడు. పేపర్ మీద బూజు నిలబడదని గ్రహించి థర్మాకోల్ షీట్‌పై అబ్దుల్ కలామ్, మదర్ థెరిస్సా బొమ్మలు వేశాడు. ఆ బొమ్మలకు మంచి స్పందన వచ్చింది. రెండు నెలల క్రితం బూజుతో బొమ్మను వేసి వీడియో తీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి పంపాడు. దీంతో ఆ చిత్రాన్ని ఎంపిక చేసిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గోల్డ్‌మెడల్‌తో పాటుగా సర్టిఫికెట్‌ను కొరియర్ ద్వారా అందించారు. అలాగే ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ వారికి పంపగా వారు కూడా సర్టిఫికెట్లు పంపించినట్లు వంశీకుమార్ తెలిపాడు. బూజుతో వేసే చిత్రాలకు సుమారుగా రెండు గంటల సమయం పడుతుందని చెబుతున్నాడు. ఇవే కాక ఆకుల మీద, బాదంపప్పులపై, పక్షుల ఈకల మీద, సిమ్‌కార్డుల మీద, పండ్లమీద, కూరగాయల మీద, ట్యాబ్లెట్ల మీద, పెన్సిల్ మీద, దారంతో చెక్కమీద చిత్రాలను వేయడంతో పాటుగా కలర్ పెయింటింగ్ వర్క్‌లోనూ నైపుణ్యం సాధించాడు. రాజకీయ నాయకులతో పాటుగా సినిమా నటులు, మహాత్మాగాంధీ, అబ్దుల్ కలామ్, మదర్ థెరిస్సా వంటి మహనీయుల చిత్రాలను అవలీలగా వేస్తుంటాడు. పేదరికంలో ఉన్నా తనలోని నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతున్నాడు.



మెడల్స్‌ను చూపుతున్న వంశీకుమార్



బాదంపప్పు మీద ఇండియా మ్యాప్

మహిళా సాధికారతకు కృషి చేయాలి



ప్రొఫైలింగ్ యాప్ నిర్వహణ వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బుధవారం గ్రీవెన్స్ హాలులో స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్ నిర్వహణపై జిల్లా స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. దీనిలో పాల్గొన్న కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు. సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆశిస్తున్నానన్నారు. ప్రతి బాలిక తప్పనిసరిగా చదువుకునేలా స్వయం సహాయక సంఘాలు కృషి చేసి సామాజిక మార్పునకు దోహదపడాలన్నారు. జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా 18 ఏళ్ల వయసు కలిగిన పిల్లలు అందులో ముఖ్యంగా బాలికలపై దృష్టి సారిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు క్యాంపెయిన్ చేయనున్నట్లు తెలిపారు. దీనిలో సంఘాల సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు కొత్త యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్‌లో సంఘాల సభ్యుల ఆర్థిక, సామాజిక పరమైన సమగ్ర డేటా నమోదు చేస్తారన్నారు. ఈ యాప్ నిర్వహణపై ఇస్తున్న శిక్షణను ప్రతి సభ్యులు క్షుణ్ణంగా అర్థం చేసుకుని డేటా నమోదుకు కృషి చేయాలన్నారు. జనవరి నాటికి యాప్ అందుబాటులోకి వస్తుందన్నారు. దీనిలో మెప్మా పీడీ రవికుమార్, ఏఓ వినీల్, టెక్నికల్ సిబ్బంది ఫణికుమారి, సంతోష్‌కుమార్, జయకుమార్, కల్పన, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: పంటకు గిట్టుబాటు ధర లభించేలా రైతులకు ఇబ్బంది లేకుండా రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుపై మార్కెటింగ్, పౌర సరఫరాలు, వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్, కో ఆపరేటివ్ అధికారులతో సమావేశం బుధవారం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ అంచనాల మేరకు 59,547 టన్నుల ధాన్యం, 61,583 టన్నుల రెడ్‌గ్రామ్ పంట ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ మేరకు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో ఉత్పత్తి అయిన పంట కొనుగోలు చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. అందుకు టెక్నికల్ అసిస్టెంట్‌లు, వీఏవోలు ఇతర సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గన్నీ బ్యాగ్స్, హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ముందగానే సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్ఓ పద్మశ్రీ, డీటీసీ సుశీల, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి, వ్యవసాయ, సివిల్ సప్లయిస్, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

క్లుప్తంగా

18 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఒంగోలు సిటీ: పదో తరగతి పరీక్ష ఫీజు గడువును ఈ నెల 18వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పొడిగించినట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో 25వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబరు 3వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబరు 10వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ తెలిపారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్ణయించిన గడువులోగా పరీక్ష ఫీజును డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు. సీఎఫ్ఎంఎస్, బ్యాంకు ద్వారా చెల్లించిన పరీక్ష ఫీజు చలానాలను ఎటువంటి పరిస్థితుల్లో అంగీకరించరన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



సుశీల మృతదేహం

పొదిలి: స్థానిక చిన్న చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు.. బాప్టిస్ట్ పాలేనికి చెందిన గాలిముట్టి సుశీల (45) అనారోగ్యంతో ఉంది. ఇటీవల భర్త మృతి చెందాడు. ముగ్గురు పిల్లలు. కుమార్తెలకు వివాహమైంది. కుమారుడు బేల్దారి పనులకు వెళుతుంటాడు. ఇటీవల వంట చేస్తుండగా గంజి మీద పడి శరీరం కాలింది. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవటంతో మానసికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ కారణాలతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. ఆమె చెరువులో పడి మునుగుతుండటాన్ని అక్కడ ఆటో శుభ్రం చేసుకుంటున్న వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారిని పిలిచాడు. ఈలోపే ఆమె నీటిలో మునిగిపోయింది. వెంటనే అతను 100కు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈతగాళ్లతో సుశీల మృతదేహాన్ని వెలికి తీయించారు. వివరాలను నమోదు చేసుకున్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త విడుదల

మార్కాపురం: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త కల్లి నాగిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై ఎక్స్‌లో పోస్టు పెట్టారని వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం మార్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసు నమోదు చేసి 41ఏ నోటీసు ఇచ్చి మంగళవారం రాత్రి విడుదల చేశారు.

ద్విచక్ర వాహనంలో పాము!

- బైక్ స్టార్ట్ కాకపోవటంతో మెకానిక్ వద్దకు తెచ్చిన రైతు
- వాహనం రిపేరు చేస్తుండగా పాము ప్రత్యక్షం



బైక్ నుంచి బయటలకు వచ్చిన పాము

పెద్దదోర్నాల: ద్విచక్ర వాహనాన్ని బాగు చేసేందుకు ఉపక్రమించిన మెకానిక్‌కు ఒక్కసారిగా పాము దర్శనమిచ్చి కలవరపాటుకు గురిచేసింది. ఈ పరిణామం స్థానికులనూ కాసేపు కంగారు పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం ఓ రైతు తన బైక్ స్టార్ట్ కావడం లేదని పెద్దదోర్నాలలోని శ్రీశైలం రోడ్డులో మెకానిక్ కృష్ణారెడ్డి వద్దకు తెచ్చాడు. బాగు చేసేందుకు కొంత సమయం పడుతుందని మెకానిక్ చెప్పడంతో వ్యక్తిగత పనులపై రైతు వెళ్లిపోయాడు. రైతు బైక్‌ను బాగు చేసే క్రమంలో విడి భాగాలు తొలగిస్తుండగా హఠాత్తుగా పాము ప్రత్యక్షమైంది. దానిని చంపేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న మరో బైక్‌లోకి దూరింది. పామును బయటకు రప్పించేందుకు మెకానిక్‌తో పాటు మరి కొంత మంది నానా తంటాలు పడ్డారు. ఆ బైక్ విడి భాగాలన్నీ తీసి చూడగా ఓ అరలో పాము కనిపించింది. స్థానికులు అప్రమత్తమై పామును చంపేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

బల్లికురవ: రోడ్డు మార్జిన్‌లో నడుచుకుంటూ పొలం వెళుతున్న వృద్ధుడిని మినీ వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన బుధవారం బల్లికురవ, కొమ్మాలపాడు, ఆర్ అండ్‌బీ రోడ్డులోని గుంటుపల్లి మేజర్ కాలువ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరు హరిబాబు (70) గ్రామం నుంచి చెన్నుపల్లి వెళ్లే రోడ్డు ద్వారా పొలం వెళుతున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం హరిబాబును వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై చనిపోయాడు. మృతునికి భార్య, ఓ కుమారుడున్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు ఎస్సై జీవీ చౌదరి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. హరిబాబు భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెల్ల బండను తొలిచేస్తున్న పచ్చ తొండలు!

యథేచ్ఛగా వైట్‌క్వార్ట్జ్ దందా సాగిస్తున్న టీడీపీ నేతలు

- 'వేస్ట్' పేరుతో అక్రమార్కులకు అండగా మైనింగ్ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- రూ.కోట్లకు పడగలెత్తుతున్న టీడీపీ నాయకులు
- అక్రమానికి చెక్ పెట్టిన తహసీల్దార్‌పై రాజకీయ ఒత్తిడి



అక్రమంగా తవ్వితీసిన వైట్‌క్వార్ట్జ్

కురిచేడు: వైట్‌క్వార్ట్జ్ అక్రమార్కులకే కాదు మైనింగ్ శాఖ అధికారులకు కూడా ఆదాయ వనరుగా మారింది. తెల్లరాయిని మైనింగ్ అధికారుల అండదండలతో యథేచ్ఛగా తవ్వి చెన్నైకి తరలించడం ద్వారా టీడీపీ నేతలు రూ.కోట్లు పోగేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎస్ఎస్పీ అగ్రహారం, పెద్దవరం, బోధనంపాడు గ్రామాల పరిధిలో పెద్ద మొత్తంలో వైట్‌క్వార్ట్జ్ నిక్షేపాలు ఉన్నాయి. తాజాగా బుధవారం మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 8లో వైట్‌క్వార్ట్జ్‌ను పొక్లెయిన్ సాయంతో తవ్వి అక్రమంగా తరలించేందుకు సిద్ధమయ్యారు. అడ్డగోలు తవ్వకాలపై మైనింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. పైగా అక్రమ వ్యాపారులకు వెసులుబాటు కల్పిస్తూ 'ఇది పనికి రాని రాయి' అని సర్టిఫికెట్ ఇచ్చి అండగా నిలుస్తున్నారు. అందులో వారి వాటా వారికి చేరుతుండటంతో కోట్లాది రూపాయల వైట్‌క్వార్ట్జ్ రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్తోంది.



వైట్‌క్వార్ట్జ్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పనికిరాని దానికి గిరాకీ ఎలా?

మైనింగ్ అధికారులు చెప్పినట్లు ఇది పనికిరాని వైట్‌క్వార్ట్జ్ అయితే క్వారీలు పెట్టి తీయించేందుకు లక్షల రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తారు? మళ్లీ దానిని చెన్నైకి ఎందుకు ఎగుమతి చేస్తారు?. ప్రజల నుంచి ఎదురవుతున్న ఈ ప్రశ్నలకు మైనింగ్ శాఖ అధికారులు నోరు విప్పడం లేదు. ఇదే వైట్‌క్వార్ట్జ్‌ను గతంలో కొన్ని కంపెనీలు ప్రభుత్వ అనుమతితో మైనింగ్ చేశాయి. ప్రస్తుతం మాత్రం పలుకుబడి ఉపయోగించి, అధికారులను లొంగదీసుకుని యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. ఇలా పలుబడితో వైట్‌క్వార్ట్జ్ తవ్వి తరలిస్తుండటం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.



పొక్లెయిన్‌ను అదుపులోకి తీసుకున్న ఆర్ఐ, వీఆర్వో

తహసీల్దార్‌పై ఒత్తిడి!

వైట్‌క్వార్ట్జ్ మైనింగ్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం కావడంతో బుధవారం ఆర్ఐ నాగరాజు, వీఆర్వో ఆంజనేయులు, సర్వేయర్ గోపీతో కలిసి తహసీల్దార్ రజనికుమారి సర్వే నంబర్ 8లో వైట్‌క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. వైట్‌క్వార్ట్జ్ తీసిన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నూజెండ్ల మండలానికి చెందిన వ్యక్తుల పొక్లెయిన్ వైట్‌క్వార్ట్జ్ రాయిని తీసి రైల్వేస్టేషన్ వద్ద ఆపి ఉండగా దానిని అదుపులోకి తీసుకున్నారు. వైట్‌క్వార్ట్జ్ తోపాటు పొక్లెయిన్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు మైనింగ్ అధికారులకు నివేదిక పంపారు. అక్రమ వ్యవహారానికి చెక్ పడటంతో అధికార పార్టీ నాయకులు తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. కేసు విత్‌డ్రా చేసుకోవాలని, వైట్‌క్వార్ట్జ్ మైనింగ్ వ్యవహారంలో వేలు పెట్టొద్దని తహసీల్దార్‌కు స్పష్టం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి తహసీల్దార్ కేసు విత్‌డ్రా చేసుకుంటారా? లేక మైనింగ్ అధికారులు వచ్చి ఇది పనికిరాని రాయి అని సర్టిఫికెట్ ఇచ్చి పాత పాట పాడతారా? అనేది వేచి చూడాల్సిందే. వైట్‌క్వార్ట్జ్ మైనింగ్ వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడి వివరాలు బయటపెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మద్యం మత్తులో రౌడీషీటర్ దాష్టీకం

- తల్లీకొడుకులను నాపరాయితో మోదిన వైనం
- కిరాణా దుకాణం ఎదుట బైక్ అడ్డుతీయమని చెప్పడమే కారణం
- సింగరాయకొండ మండలం శానంపూడిలో ఘటన



తీవ్రంగా గాయపడిన కొండలరావు

సింగరాయకొండ: మద్యం మత్తులో ఓ రౌడీషీటర్ తల్లీకొడుకుపై కర్ర, నాపరాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి 8 గంటల సమయంలో సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వాసేపల్లి కొండలరావు ఎస్సీ కాలనీ సెంటర్‌లో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి సింగరాయకొండ పంచాయతీ ఆంజనేయనగర్‌కు చెందిన రౌడీషీటర్ బండి నవీన్ గ్రామంలోని బంధువుల ఇంటికి వస్తూ కొండలరావు షాపు ముందు బైక్ ఆపాడు. వచ్చీపోయే వారికి బైక్ అడ్డుగా ఉందని, పక్కన పెట్టుకోవాలని కొండలరావు తల్లి ధనమ్మ సూచించగా మద్యం మత్తులో ఉన్న నవీన్ ఆమెపై కర్రతో దాడి చేశాడు. తల్లిపై దాడిని అడ్డుకునేందుకు యత్నించిన కొండలరావు తలపై నవీన్ నాపరాయితో బలంగా కొట్టడంతో స్పృహ తప్పిపడిపోయాడు. అయినప్పటికీ శాంతించకుండా కొండలరావు తలపై రాయితో బలంగా కొడుతుండటంతో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న కొండలరావును, అతని తల్లి ధనమ్మను ఆస్పత్రి తరలించేందుకు స్థానికులు 108కు ఫోన్ చేయగా లైన్ కలవలేదు. దీంతో ఓ ఆటోలో ఆస్పత్రికి తరలించారు. సీఐ హజరత్తయ్య ఆదేశాలతో ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు నవీన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొండలరావు పరిస్థితి విషమంగా ఉండటంతో బంధువులు ఆందోళన చెందుతున్నారు.



108 లేకపోవడంతో క్షతగాత్రులను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

యువకుడు అనుమానాస్పద మృతి



వీరయ్య(ఫైల్)



మృతి చెందిన వీరయ్య



విలపిస్తున్న కటుంబ సభ్యులు

బేస్తవారిపేట: బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్న యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ సంఘటన బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెం సమీపంలో చోటుచేసుకుంది. కంభం మండంలోని పోరుమామిళ్లపల్లెకు చెందిన కాకర్ల వీరయ్య(38) బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా కంభం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం నుంచి కనపడకుండా పోయాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు వెతకడం ప్రారంభించారు. బుధవారం కంభం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు వీరయ్యకు చెందిన ఒక సెల్‌ఫోన్ హైవే రోడ్డు పక్కన రెడ్డి లాడ్జి సమీపంలో, మరొక సెల్‌ఫోన్ గూడెంలోని ఎస్సీకాలనీ సమీపంలో చివరి లోకేషన్ ఉన్నట్లు స్నేహితులకు తెలిపారు. ఈ క్రమంలో చింతలపాలెం సమీపంలోని ఓ రెస్టారెంట్ వెనుక వైపు ఉన్న ప్లాట్లలో మోటార్‌సైకిల్‌ను, చీతిరాల కతువ అంచున తల బయటకు కనిపిస్తూ మృతదేహం, కతువ అంచున చెప్పులను గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కతువ నుంచి బుధవారం రాత్రి మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి వీరయ్య మృతదేహంగా గుర్తించారు. కుటుంబానికి ఆధారమైన వీరయ్య మృతితో తల్లిదండ్రులు నారాయణ, రమణమ్మ బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు, ఐదు నెలల కుమార్తె ఉన్నారు. బజాజ్ ఫైనాన్స్‌లో రికవరీ సమయంలో ఎవరితోనైనా విభేదాలు రాగా హత్య చేసి ఉంటారని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకునేంత సమస్యలేమీ వీరయ్యకు లేవని బంధువులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మదనపల్లెలో సింగరాయకొండ వాసి మృతి

మదనపల్లె: మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గుర్తించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామచంద్ర ఆదేశాలతో ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి అతని వద్ద వివరాల కోసం తనిఖీ చేశారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా అతని పేరు షేక్ నజీర్‌అహ్మద్(66)గా గుర్తించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ సెల్‌టవర్ వీధిగా వివరాలు లభ్యమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా మార్చురీ గదికి తరలించారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు.

ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీపై ఐటీ దాడులు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలో ఉన్న ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంటు పై బుధవారం సెంట్రల్ ఇన్‌కంటాక్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ తనిఖీల్లో ఇన్‌కంటాక్స్ అధికారులు 11 మంది, సెంట్రల్ ఇండస్ట్రియల్ స్పెషల్ ఫోర్స్ సిబ్బంది 20 మంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు

- సిబ్బందిని అభినందించిన ఎస్పీ తుషార్ డూడి

చీరాల రూరల్: ఒక వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన కేసులో నేరం రుజువు కావడంతో చీరాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం. సుధ ఆరుగురు నిందితులకు కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించారు. తీర్పు బుధవారం చీరాల కోర్టులో వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2017లో బాధితుడైన చీరాల థామస్‌పేటకు చెందిన బొనిగల శ్యాంబాబు తన హీరో ఆక్టివా బండిపై ముంతావారి సెంటర్‌కు వెళుతుండగా బజాజ్ పల్సర్ బండిపై ఇద్దరు వ్యక్తులు శ్యాంబాబు బండిని అనుసరించి ఇనుపరాడ్డుతో అతని తలపై దాడి చేశారు. దీంతో శ్యాంబాబు బండితో సహా కిందపడిపోయాడు. ఇదే అదనుగా భావించిన ముద్దాయిలు తమవెంట తెచ్చుకున్న కత్తులతో శ్యాంబాబు గుండెలపై పొడిచారు. దీంతో బాధితుడు పెద్దపెద్దగా కేకలు వేయడంతో పారిపోయారు. అలాగే బాధితుడు ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు బాధితుణ్ణి చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటి సీఐ వి. సూర్యనారాయణ నిందితులపై 307 హత్యాయత్నం కేసును నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. బాధితుడు తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పద్మజా రెడ్డి తమ వాదనలు వినిపించారు. పూర్వా పరాలను విచారించిన న్యాయమూర్తి ఎం. సుధ నిందితులపై ఉన్న నేరారోపణలు రుజువు కావడంతో తీర్పునిచ్చారు. ముద్దాయిల్లో నలుగురైన చీరాల జాన్‌పేటకు చెందిన జొన్నలగడ్డ ప్రభుదాసు అలియాస్ నాని, జొన్నలగడ్డ అశోక్‌కుమార్, ఉప్పు రమేష్, సాతినేని శివపార్వతిలకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2,000 జరిమానా విధించారు. దేవిశెట్టి మస్తాన్‌రావు, అరతోటి ప్రసాద్‌లకు ఒక ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు చెరో రూ. 1,000 జరిమానాలు విధించారు. కేసు ఛేదించిన అప్పటి సీఐ సూర్య నారాయణ, ప్రస్తుత సీఐ ఎం. శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ ఎ. నీలకంఠారెడ్డి, పీపీ పద్మజా రెడ్డిని ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

మత్స్యకారుల 'వల'విల!



మత్స్య సంపద పడక ఖాళీగా వచ్చిన బోటు

- చేపలు పడక ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు
- వేట విరామ సమయం నుంచి మత్స్య సంపద శూన్యం
- పెట్టుబడి కూడా చేతికి రాక అప్పులవుతున్న గంగపుత్రులు

కొత్తపట్నం: వేట విరామ సమయం నుంచి ఎదురవుతున్న గడ్డు పరిస్థితులు మత్స్యకారులను తీవ్ర నిరాశలోకి నెడుతున్నాయి. ఆశతో వేటకు వెళ్లినా మత్స్య సంపద అంతంత మాత్రంగా పడుతుండటంతో డీజిల్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు గంగపుత్రులు ఇళ్లకు పరిమితమై ప్రత్యామ్నాయ పనులు వెతుక్కుంటున్నారు.

కొత్తపట్నం మండలంలో తీరప్రాంత గ్రామాలైన గుండమాల, పిన్నింటివారిపాలెం, కె.పల్లెపాలెం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరు వాసులు ఎక్కువ మంది చేపల వేట మీదే ఆధారపడి జీవిస్తారు. ఈ గ్రామాల నుంచి మోటరైజ్డ్ బోట్లు 518, నాన్ మోటర్‌రైజ్డ్ బోట్లు 150.. వెరసి మొత్తం 668 బోట్లు వేటకు వెళ్తాయి. ఈ బోట్లనే నమ్ముకుని వేట సాగిస్తూ సుమారు 4,500 మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. ఒక బోటు వేటకు వెళ్తే రోజూ 20 నుంచి 30 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది. అయితే గత రెండు నెలలుగా మత్స్యసంపద వలలకు చిక్కకపోతుండటంతో డీజిల్‌కు ఖర్చు చేసిన సొమ్ము కూడా చేతికిరావడం లేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడలూరు సోనా బోట్లు తరచూ తీరప్రాంతానికి దగ్గరగా వస్తూ వేట సాగిస్తుండటమే మత్స్య సంపద చిక్కకపోవడానికి కారణం. వలల్లో కేవలం పీతలు, కానాకంతలు పడుతున్నాయి. పీతలు కేజీ రూ.140, కానాకంతలు కేజీ సైజును బట్టి రూ.100 నుంచి రూ.150 పలుకుతున్నాయి. వీటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఆశించిన స్థాయిలో మత్స్య సంపద పడక, పెట్టుబడి కోసం చేసిన అప్పు తీరక మత్స్యకారులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. సోనా బోట్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



అరకొరగా పడిన పీతలను కాటా వేస్తూ..

అనితమ్మా.. ఎక్కడమ్మా..?



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు టౌన్: తెలుగుదేశం పార్టీ అగ్రకుల నాయకుల వేధింపులు, పోలీసుల బెదిరింపులు తాళలేక మాదిగ సామాజికవర్గానికి చెందిన రైతు చింతల శీను ఆత్మహత్య చేసుకుని రోజులు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర హోం మంత్రి అనిత కనీసం పరామర్శించిన పాపాన పోలేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు విమర్శించారు. బుధవారం సమితి కార్యలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతల శీను కుటుంబాన్ని పరామర్శించక పోగా కనీసం నష్టపరిహారం ప్రకటించకపోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన మాదిగలు మరణిస్తే హోం మంత్రి పరామర్శించరా అంటూ నిలదీశారు. అక్టోబర్ 21వ తేదీన తన మరణానికి కారణమైన వారి పేర్లను చెబుతూ సెల్ఫీ వీడియో తీసుకున్న చింతల శీను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. శీను వీడియోలో ప్రస్తావించిన ఏడుగురిలో మండూరి వెంకటేశ్వర్లు, డ్రైవర్ బాబు పేర్లను పోలీసులు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. అక్టోబర్ 28వ తేదీన శీను మరణించినప్పటికీ ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. 'అమ్మా అనితమ్మా.. ఎక్కడున్నావు తల్లీ, ఒకసారి చింతల శీను కుటుంబం వేదనను చూసి కన్నీరు తుడువమ్మా' అంటూ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, దళిత నాయకుడు కాకుమాను రవి పాల్గొన్నారు.